# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 23, సెప్టెంబర్ 2025




### భూ సేకరణ, నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ

# పకడ్బందీగా చేపట్టాలి

★ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

నస్పూర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త

జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూ సేకరణ, నష్ట పరిహారం చెల్లింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జాతీయ రహదారులు, అటవీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు, అదనపు కలెక్టర్లతో హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్, హైదరాబాద్ విజయవాడ 6 వరుసల జాతీయ రహదారి 65 రోడ్డు పనులు, హైదరాబాద్ నుంచి అమరావతి, మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్, హైదరాబాద్ శ్రీశైలం 4 వరుసల జాతీయ రహదారి 765 రోడ్డు పనులు, జాతీయ రహదారి 163 మన్నెగూడ సెక్షన్ 4 వరుసల రోడ్డు, హైదరాబాద్ మంచిర్యాల 4 వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడార్ పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపడుతున్న జాతీయ రహదారులు, గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూ సేకరణ, నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల సంస్థ, రాష్ట్ర అధికారులు సమన్వయంతో పని చేస్తూ జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ భూసేకరణ పూర్తి చేయాలని తెలిపారు. జాతీయ రహదారి 163జి పరిధిలో పెండింగ్‌లో ఉన్న 130 హెక్టార్ల భూ బదలాయింపు ప్రక్రియ ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని, రహదారి పరిధిలో ఉన్న జిల్లాల కలెక్టర్లు ప్రత్యేకంగా ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. భూ సేకరణ ప్రక్రియలు కలెక్టర్లు నేరుగా రైతులతో చర్చించాలని, వారికి జాతీయ రహదారుల సంస్థ ద్వారా మెరుగైన పరిహారం అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. రహదారుల నిర్మాణాలలో అవసరమైన అటవీ శాఖ అనుమతులు, కోర్టు కేసులను త్వరగా పరిష్కరించి సంబంధిత యజమానులకు నష్టపరిహారం అందించాలని తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణంలో భూసేకరణ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత రహదారులు రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ద్వారా రాష్ట్రపతి పేరిట మ్యుటేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటవీ శాఖలోని వన్యప్రాణి సంరక్షణ పరిధిలోని రాని భూములకు సంబంధించి అనుమతులను త్వరగా మంజూరు చేసేలా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇట్టి భూములకు బదులుగా అటవీ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జి పరిధిలో 3వ విడత ఆర్బిట్రేషన్ కొరకు దాఖలు చేసిన 114 కేసులను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదారి 63 కు సంబంధించి జిల్లాకు చెందిన 17 గ్రామాలలో కోర్టు స్టే కలిగిన గ్రామాలను మినహాయించి మిగిలిన గ్రామాలలో అవార్డు జారీ చేయడం జరిగిందని, అక్టోబర్ 30వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు చేరువలో

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



* సింగరేణి కార్మికులకు 34 శాతం బోనస్
* రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద

నస్పూర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లాలోని భీమారం మండల ప్రజలకు చేరువలో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్ మోహన్, మండల తహసీల్దార్ వనజ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రజల సంక్షేమంలో భాగంగా భీమారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని, ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 15వ ఆర్థిక ప్రణాళికలో 1 కోటి 43 లక్షల రూపాయల నిధులతో పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలోభవన నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం సి.సి. రోడ్లు, మురుగు నీటి వ్యవస్థ నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అర్హులైన మిగతా 2లో..

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్యతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన తనకు గ్రామ శివారులో గల భూమి ఆస్తులు ఉన్న వారి మిగతా 2లో..





# రాష్ డ్రైవింగ్ చేసే వారిపై చట్టపరమైన చర్యలు

* జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త

రాష్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ పై పోలీస్ శాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ మైనర్ వాహనం నడిపి పట్టుబడిన సందర్భాల్లో వాహన యజమాని పై కూడ కేసు నమోదు చేయబడతుందన్నారు. వాహన యజమానులు మైనర్ వ్యక్తికి వాహనం ఇవ్వరాదనీ, మైనర్ వాహనం నడిపినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సూచించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు ఉపయోగించి చైన్ స్నాచింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ నిరంతర తనిఖీలు చేపడుతుందని, ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

పేర్లు తొలగించి అసలు పట్టాదారులు అయినా తమ పేరిట పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఎ.ఐ.ఎస్.బి. విద్యార్థి సంఘం ప్రతినిధులు తమ దరఖాస్తులో లక్షెట్టిపేట బి.సి. వసతి గృహం, బెల్లంపల్లి ఎస్.సి. వసతి గృహాల విద్యార్థుల సంక్షేమంలో నిరక్ష్యం వహిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. చెన్నూర్ పట్టణానికి చెందిన కౌట్ల సతీష్ చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని తన ఇంటికి ఇంటి పన్ను అధికంగా వస్తుందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన మహమ్మద్ రసూల్ బి తన భర్త మరణించారని, తన పిల్లలు తన పోషణ చూసుకోవడం లేదని, ఈ విషయమై తనకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం ఇంధనపల్లి గ్రామానికి చెందిన పెంద్రం యశ్వంత్ రావు తాను దివ్యాంగుడను అని, గత 10 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివసిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం బుద్ధిపల్లి గ్రామానికి చెందిన ఐరగడ్డ దేవమ్మ తాను గతంలో కొనుగోలు చేసిన భూమిని తన పేరిట మార్చి పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం గోపాల్ నాగారం గ్రామానికి చెందిన గాజుల తిరుపతి, గాజుల వెంకటేశం, గాజుల రవి తమ తండ్రి పేరిట తాండూర్ గ్రామ శివారులో గల భూమి రెవెన్యూ రికార్డులలో ఇతరుల పేరుట చూపుతోందని, ఈ పొరపాటున సవరించి తమ పేరిట మార్చాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం బూదకలాన్ గ్రామానికి చెందిన రైతులు తమ చేనులోనికి వెళ్లడానికి దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు అల్పాహారం పంపిణీ

పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త

పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అధికారులు యూరియా పంపిణి చేయగా పలు గ్రామాల రైతులు యూరియా బస్తాల కోసం గంటల తరబడి లైన్లలో నిలబడగా వారికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో మండల నాయకులు అల్పాహారం పంపిణి చేశారు. ఈ కార్యక్రమములో నాయకులు చౌదరి తిరుపతి, సంజీవ్, ఖైరత్, వెంకటాచలం, శ్రీనివాస్, మహేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన దుర్గామాతలు

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని దేవీ నవరాత్రులను పురస్కరించుకొని పలు కాలనీలలో దేవి దుర్గామాతలను ప్రతిష్టించారు. దేవీ నవరాత్రులు హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైన పండుగలలో ఒకటి, తొమ్మిది రోజులపాటు భక్తులు పలువురు మాలాధారణ ఆచరించారు. దుర్గామాత మండపాల వద్ద ప్రజలు భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజించారు.



# ప్రజలకు చేరువలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేసి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. భీమారంలో 15 కోట్ల రూపాయలతో స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో రహదారుల నిర్మాణంలో అవసరమైన అటవీ అనుమతులు పొంది పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూర్, కోటపల్లి మండలాలలో పంట సాగుకు అవసరమైన 500 టన్నుల యూరియా అదనంగా అందించడం జరుగుతుందని, రైతులు ముందస్తుగా రబీ కోసం కాకుండా అవసరం మేరకు యూరియా వినియోగించుకోవాలని తెలిపారు. రామగుండం ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 10వేల కోట్ల రూపాయలతో ఎరువుల పరిశ్రమను తిరిగి ప్రారంభించడం జరిగిందని, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలలో అవసరమైన యూరియా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సింగరేణి సంస్థలో గత సంవత్సరం 4 వేల 800 కోట్ల రూపాయల లాభం రాగా ఈ సంవత్సరం 6 వేల 340 కోట్ల రూపాయలు లాభం వచ్చిందని, రెగ్యులర్ కార్మికులకు 34 శాతం బోనస్, ఒప్పంద కార్మికులకు 5 వేల 500 రూపాయల బోనస్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ఇందులో భాగంగా అంబులెన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సీజనల్ వ్యాధులకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కృషి చేస్తామని, ఇందులో భాగంగా అవసరమైన ఫర్నిచర్, వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలలో నిపుణులైన వైద్యుల ద్వారా ప్రత్యేక వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండలంలోని 33 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్యులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## కదిలి ఆలయంలో ఎమ్మెల్యే ఏలేటి దంపతుల పూజలు

దిలావర్పూర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త

దిలావర్పూర్ మండలం కదిలి గ్రామంలో కొలువై ఉన్న ప్రాచీన పుణ్యక్షేత్రం శ్రీమాతా అన్నపూర్ణ పపాహరేశ్వర ఆలయంను సోమవారం స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవి నవరాత్రులలో భాగంగా శివలింగమును దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ దేవదాయ శాఖ ఈవో భూమయ్య సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన పుట్టిన రోజు కావడంతో పుష్పగుచ్చాలు అందజేసి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు సీనియర్ నాయకులు దొడ్డికింది ముత్యంరెడ్డి, ముచ్చిండ్ల సుధాకర్, పల్దె ఉమాశంకర్, శైలేశ్వర్, రమేష్, సాయారెడ్డి, మహబూబ్, మహిపాల్, భోజరం పటేల్, సాయి, దీక్షిత్ రెడ్డి, పండరి, ముత్యం, దానె నర్సయ్య తదితరలు ఉన్నారు.



## సీఎం రిలీఫ్ పండ్ చెక్కుల పంపిణీ

పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త

సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆదేశాల మేరకు సోమవారం పెంచికల్ పేట్ మండలంలోని చెడ్వాయి గ్రామములో బిజెపి మండల అధ్యక్షుడు కుకిడే రాజేష్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను లబ్ధిదారులు బోయిరే శంకర్, జంపాల బాపు బోయిరే పేంటు కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో ప్రయివేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న బాధితులకు త్వరితగతిన ఆర్థిక సహాయం అందేలా ఎమ్మెల్యే కృషి చేశారాని తెలిపారు. ఈ కార్యక్రమములో నాయకులు మధుకర్, నాన్నయ్య, ప్రభాకర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థినిగా ఆర్ఎంపీ కుమార్తె..

### - దాతల సాయం కోసం ఎదురుచూపు

వేమనపల్లి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త



చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించారు. ఆమె అత్యుత్తమైన వైద్య చదువులకు ఆర్ఎంపి కుమార్తె అర్హత సాధించి ఔరా అనిపించారు. వేమనపల్లి మండలం నాగారం గ్రామానికి చెందిన సైదల కిష్టయ్య, జ్యోతి కుమార్తె సైదల పల్లవి నీట్ ఫలితాల్లో సత్తా చాటింది. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీట్ సాధించింది. మారుమూల గ్రామానికి చెందిన ఆర్ఎంపి కుమార్తె ఎంబిబిఎస్ సీట్ సాధించడం పట్ల గ్రామస్తులు పల్లవిని అభినందించారు. మెడిసిన్లో సీటు సాధించిన తన చదువుకు ఆర్థిక భారంగా మారుతుందని సదరు విద్యార్థిని పల్లవి ఆవేదన వ్యక్తం చేస్తుంది. దాతలు ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదుకోవాలని మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థిని వేడుకుంటుంది. వివరాలకు ఈ సెల్ నెం 9705248896 సంప్రదించాలని కోరింది.

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

### - జిల్లా ఎస్పి కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త

ప్రజావాణిలో దరఖాస్తు చేసుకునే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకోనేందుకు వీలుంటుందన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పోలీసులు పనిచేయాలన్నారు.



# యూరియా కోసం రైతుల ధర్నా



**బెజ్జూర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

బెజ్జూర్ మండలంలో యూరియా కోసం రైతులు గత నెల రోజుల నుండి ఇబ్బందులు పడుతున్నారు.సోమవారం మధ్యాహ్నం యూరియా కోసం వచ్చిన రైతులు అధికారులు తమ సమస్యను తీర్చాలని కోరుతూ బస్టాండ్ ఏరియాలో ప్రధాన రహదారిపై రాస్తారోకో,ధర్నా నిర్వహించారు. తాము ఎంత ఇబ్బంది పడుతున్నా అధికారులు తమను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాదారు పాసుపుస్తకాలు పట్టుకొని రోజుల తరబడి తిరుగుతున్నామని అన్నారు. ఒక్క పాసు పుస్తకానికి వ్యవసాయ శాఖ అధికారులు రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తున్నారని రెండు బస్తాలను తాము ఎన్ని ఎకరాలకు వేయాలని అధికారులను నిలదీశారు. అధికారులను అడిగితే సమాధానం ఇవ్వడం లేదని ఒక ఎకరా కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులు ఏమి చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు బస్తాల యూరియా కోసం డబ్బులు చెల్లించి రోజులు గడుస్తున్నా తమకు యూరియా అందడం లేదని వాపోయారు. రైతుల కోసం వచ్చిన యూరియా దళారుల పాలవుతోందని అందువల్లనే తమకు యూరియా అందడం లేదని తమకు సరిపడా యూరియా అందించాలని వారు కోరారు. వీరి చేస్తున్న ధర్నాకు బిఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు. ధర్నా చేస్తున్న రైతుల వద్దకు ఎస్ఐ సర్తాజ్ పాషా, ఏఓ నాగరాజు వచ్చి యూరియా ఇస్తున్నామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు. తాము ఉన్నతాధికారుల ఆదేశానుసారం పంపిణీ చేస్తున్నట్లు ఏఓ తెలిపారు.



## అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**బజార్ హత్నూర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పూర్వీకుల ఆచార ప్రకారం మహాలయ అమావాస్య అయినా మరుసటి రోజు ఇక్కడ సద్దుల బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. ప్రకృతితో మమేకమైన తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల ఔన్నత్యాన్ని కలగలిపే తెలంగాణ ఆడపడుచులు, చిన్నారులు గూనుగు పువ్వులు, తంగేడు పువ్వులు, బంతి పువ్వులతో బతుకమ్మను వలయాకారంలో పేర్చి గౌరమ్మను తయారుచేసి పూజించి ఆడపడుచుల ఆట పాటల కోలాటాల నడుమ పోయిరావమ్మా సద్దుల బతుకమ్మ అని సాగనంపారు.



## సబ్ స్టేషన్ ముందు ధర్నా

**కెరమెరి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

మండలంలోని బాబేఝరి మహారాజ్ గూడ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చెడిపోయిందని గత నాలుగు రోజుల నుంచి విద్యుత్ లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు అధికారులకు చెప్పిన స్పందించకపోవడంతో సోమవారం మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ ముందు గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. గ్రామంలో విద్యుత్ లేక అటవీ ప్రాంతం కావడంతో పాములు ఇండ్లలోకి వస్తున్నాయన్నారు రాత్రివేళ చిన్న పిల్లలు ఒంటికి వెళ్లడానికి భయపడుతున్నారన్నారు పిర్యాదు చేసిన ఎందుకు పట్టించుకుంటాలేరని అధికారులను ప్రశ్నించారు. వెంటనే తమ గ్రామానికి విద్యుత్ సరఫరా చేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాథోడ్ గోపాల్, రాథోడ్ సుభాష్, మూట ఎల్లయ్య, రాజు, చిన్ను, పండిత్ తదితరులు ఉన్నారు. ఈ విషయం,పై విద్యుత్ ఏఇ రమేష్‌ని చేరవానిలో వివరణ కోరగా ఈ విషయం ఆదివారం సాయంత్రం తమ దృష్టికి రాగానే మహారాజ్ గూడకు విద్యుత్ సిబ్బందిని పంపించి ట్రాన్స్ఫారం కాలిపోయింది అని సిబ్బంది చెప్పడంతో వేరే ట్రాన్స్ఫార్ పంపించి బిగిస్తున్నట్లు సోమవారం సాయంత్రం కల్లా విద్యుత్ సరఫరా అందించనున్నట్లు తెలిపారు.

## మహేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**సారంగాపూర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

మండలంలోని బిజెపి నాయకులు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి జన్మదిన దినాన్ని పురస్కరించుకొని చించొలి (ఎం) గ్రామంలోని ఆలయంలో అతని పేరట అభిషేకం చేయించారు. ఆయురారోగ్యాలతోమరిన్ని జన్మదినాలు జరుపుకోవాలని కోరుకొన్నారు అనంతరం ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలినారు. ఇందులో పాల్గొన్న నాయకులు బి.జె.పి. పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.




## ప్రమాదంలో తల్లి బిడ్డ మృతి

### - మృతులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారు

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**



కాగజ్‌నగర్ సమీపంలో ఆదివారం రాత్రి రైలు ఢీకొని తల్లి బిడ్డ మృతి చెందినట్లు రైల్వే బెల్లంపల్లి ఎస్సై సుధాకర్, మంచిర్యాల హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన జగత్‌రామ్, భార్య స్వప్న (27), పాప జస్మి (11 నెలలు) లతో కలిసి ఇటుక బట్టీలో పనిచేయడానికి 20 రోజుల క్రితం వలస వచ్చినట్లు, వీరు కాగజ్‌నగర్ సమీపంలోని చింతగూడ వద్ద నివాసం ఉంటున్నట్లు తెలిపారు. జగత్‌రామ్ దంపతులకు నలుగురు ఆడపిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు. కుటుంబ కలహాలతో ఆదివారం రాత్రి స్వప్న బిడ్డతో ఆత్మహత్యకు పాల్పడినట్లు అడ్డుకోవడానికి వెళ్లిన జగత్‌రామ్ గాయాలతో బయటపడగా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, స్వప్న పాప రైలు ఢీకొని మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.



## ఆస్పత్రి సూపరిండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

### - టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

మీడియా స్వేచ్ఛను హరించిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరిటెంట్ పై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ డిమాండ్ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరిటెంట్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ లో అడిషనల్ కలెక్టర్ ఎం డేవిడ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో జరుగుతున్న అవినీతి భాగోతాలు బయటపడతాయనే భయంతోనే ఆసుపత్రిలో మీడియా పై ఆంక్షలు విధించారని ఆరోపించారు.ఆసుపత్రిలో మీడియాపై ఆంక్షలు ఎత్తివేయడంతో టీయూడబ్ల్యూజే కలెక్టరేట్ ధర్నా ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. కానీ మీడియా స్వేచ్ఛను ఆ గౌరవ పరిచి, మీడియా ప్రతినిధులను బెదిరించే విధంగా వ్యవహరించిన ప్రభుత్వ ఆస్పత్రి సూపరిటెంట్ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ విషయం పై తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కు ఫిర్యాదు చెయ్యనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ జమీల్, జిల్లా సంయుక్త కార్యదర్శి అబ్దుల్ హన్నన్, పాత్రికేయులు హరికృష్ణ, ఎన్ తారు, షఫీ ఉల్లా బేగ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## దసరా నవరాత్రులు ప్రారంభం

### కొలువుదీరిన మాతలు...భక్తి శక్తులతో అమ్మవార్లకు స్వాగతాలు

**దిలావర్పూర్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:**



దిలావర్పూర్ మండలంలోని అన్ని గ్రామాలలో దుర్గామాత తొలి రోజు బాల త్రిపుర సుందరిగా దర్శనమిచ్చింది. ఉదయం నుంచి మండలంలోని ప్రసిద్ధ ప్రాచీన పుణ్యక్షేత్రాలైన రేణుక ఎల్లమ్మ, శ్రీమాతా అన్నపూర్ణ పాపహరేశ్వర ఆలయాలలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రంలో అమ్మవారిని డీజే పాటలతో మంగళ హారతులు పట్టుకొని ఆయా మండప సభ్యులు మండపం వరకు ఘనంగా స్వాగతం పలికారు. గుండంపల్లి... గ్రామంలో ఒకే దుర్గామాత ఉండాలని ఓ సామాజిక వర్గం వారు సుమారు 500 కు పైగా మంది 40 ట్రాక్టర్లు, 200 బైకులతో ర్యాలీ చేపట్టి మండపం వరకు ఘనంగా తీసుకొచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు భవానీ దీక్ష తీసుకొని భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు అందిస్తామని, నియమనిష్టలతో పూజలు చేస్తామని తెలిపారు. కొలువుదీరిన అమ్మవార్లకు ఆయా వేద పండితులు మండపాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చౌక ధరల దుకాణం మంజూరు చేయాలని, బి.టి. రోడ్డు నిర్మాణం మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, భూమిని ఆక్రమించుకున్న పట్టాను రద్దు చేసి తమ పేరిట పట్టా మంజూరు చేయాలని, ఉపాధి కల్పించాలని, ఇంటికి గృహ జ్యోతి పథకం వర్తింపచేయాలని, ట్రై సైకిల్ మంజూరు చేయాలని పలువురు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రిజర్వేషన్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి



**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా రిజర్వేషన్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జెడ్పిటిసి/ఎంపిటిసి, సర్పంచ్, వార్డ్ మెంబర్లకు రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టేందుకు విధివిధానాలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో వార్డు సభ్యుల స్థానాలు, సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి స్థానాలకు రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు జనాభాను ప్రామాణికంగా తీసుకోవాలని, 2019లో స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల రిజర్వేషన్లు, 2011 జనాభా, 2024 సంవత్సరంలో ప్రభుత్వం చేపట్టిన వెనుకబడిన తరగతుల గణన ప్రామాణికంలో తీసుకోవాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలోని సర్పంచ్, వార్డులకు నిబంధనలను పాటించాలని, రిజర్వేషన్ల ప్రక్రియలు ఎలాంటి లోటుపాట్లు జరగకుండా పకడ్బందీగా చేపట్టి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్**



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

మిషన్ భగీరథ (గ్రిడ్) పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో కార్మికుల పెండింగ్ వేతనాలుచెల్లించాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకంలో సుమారుగా గత దశాబ్ది కాలం నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ కుటుంబ పోషణ భారమైనప్పటికీ పేద, బడుగు బలహీన వర్గాలకు త్రాగునీరు అందించడంలో మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. వీరికి కార్మిక చట్టాలు అమలు చేయకపోవడంతో శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చొరచూపి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించిమిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు బాలేష్, పురుషోత్తం, భగవత్, రవీందర్, గౌతమ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా నిలబడుతాం

**- దుర్గం దినకర్ కె.వి.పి.ఎస్ జిల్లా కార్యదర్శి**

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త**

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, అవుట్సోర్సింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా నిలబడతామని కె.వి.పి.ఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, అవుట్సోర్సింగ్ వర్కర్లు చేస్తున్న సమ్మె సోమవారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వర్కర్లందరూ కలెక్టరేట్ ఎదుట బోనమెత్తి సాంప్రదాయమైన డెంసా కళను ప్రదర్శిస్తూ జిల్లా కేంద్రంలోని పలుచౌకుల గుండా ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్నటువంటి డైలీవేజ్ ఔట్సోర్సింగ్ వర్కర్లు తమ న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారానికి సమ్మెకు దిగి 11 రోజులైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని, ఎమ్మెల్యే, మంత్రుల జీతాలు పెంచుకోవడంలో ఈ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. ఉన్న వేతనాలలో కోత విధించే విధంగా జీవో నెంబర్ 64 ను తీసుకొచ్చిందని, ఈ జీవో ను రద్దు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజీ, అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్ జిల్లా అధ్యక్షులు తొడసం వసంత్ రావ్, కోశాధికారి మరప రాంబాయి, యూనియన్ ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

